క్లుప్తంగా

ట్రైసైకిళ్ల పంపిణీ


ప్రత్యేక అవసరాల చిన్నారులకు ట్రైసైకిళ్లు అందిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు

వేపాడ: భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం సమకూర్చిన ట్రైసైకిళ్లను ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు మండలంలో వల్లంపూడి గ్రామంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల చిన్నారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగించుకునేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎంఈఓ జి.శ్రీదేవి, ఎంపీడీఓ పట్నాయక్, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, వైస్ సర్పంచ్ రుద్ర వెంకటరావు, ఉపాధ్యాయులు అర్జున రావు, నరిసంహమూర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గజపతినగరం: పట్టణంలోని పోలీస్ స్టేషన్ రోడ్డుతో పాటు వినాయక ఆలయం రహదారి ప్రాంతాలకు బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈ శివకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో చేస్తున్న రహదారి విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ లైన్ల మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాలలో తనిఖీలు


రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈఓ విమలమ్మ

గజపతినగరం: మండలంలో పురిటిపెంటలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ విమలమ్మ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డులు, లెసన్ ప్లానింగ్ డైరీలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు.ఆమె వెంట సీఆర్పీ రెడ్డి ఉ న్నారు.

చీరల పంపిణీ

జామి: మండలంలోని జాగరం గ్రామంలో శ్రీ సత్యసాయిబాబా మందిరంలో 60 మంది పేద మహిళలకు భజన మండలి సభ్యులు సమకూర్చిన చీరలను ఈఓపీఆర్డీ ఐ.వి.లక్ష్మి మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. భజనమండలి సభ్యులు ఈశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుజ్జింగివలసలో వైద్యశిబిరం


వైద్యశిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రకుమారి, సిబ్బంది

గుర్ల: మండలంలోని గుజ్జింగివలసలో విజయనగరం తిరుమల ఆస్పత్రి సౌజన్యంతో మంగళవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశామని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి అప్పలనర్సయ్య, అట్టాడ అప్పలరాజు తెలిపారు. శిబిరంలో గ్రామానికి చెందిన 152 మందికి వైద్యురాలు చంద్ర కుమారి, ఇతర సిబ్బంది వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు

వేపాడ: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అన్నారు. వావిలపాడులో గ్రామ దేవత పైడిమాంబ తీర్థం సందర్భంగా సర్పంచ్ బీలా రాజేశ్వరి, యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్‌ఐ రాజేష్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. టోర్నమెంటులో విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన 30 జట్లు పాల్గొంటున్నాయని, విజేత జట్టుకు రూ.10 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.6 వేలు, రూ.4 వేలు నగదు బహుమతి అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామపెద్ద, వైఎస్సార్‌సీపీ నాయకుడు బీల సతీష్ , వైస్ఎంపీపీ అడపా ఈశ్వరరావు, నాయకులు బోజంకి శ్రీను, బొడ్డు శ్రీను పాల్గొన్నారు.

31న మండల సర్వసభ్య సమావేశం

దత్తిరాజేరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 31న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి అన్ని శాఖలకు సంబంధించిన మండల అధికారులు, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

నవరత్న పథకాలతో పేదల ఇంట ఆనందం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


లక్కవరపుకోట: పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలతో పేదల ఇంట ఆనందం నెలకొందని, పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయ ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రంగరాయపురం గ్రామంలో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు మాజీ సర్పంచ్ దేగల సాయిలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. గ్రామంలో ఇళ్ల పట్టాలకు సంబంధించిన సమస్యను త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ, స్థానిక ఎంపీటీసీ కె.సత్యవతి, చందులూరు ఎంపీటీసీ యడ్ల కిశోర్‌కుమార్, పార్టీ నాయకులు డి.రమణమ్మ, ఎర్రా శ్రీనివాసరావు, జామి అప్పలరాజు, గొలగాని సత్యనారాయణ, సీహెచ్.మాదవరావు, జి.సన్నిబాబు పాల్గొన్నారు.

రూ.63 లక్షలతో ఇంటింట కుళాయిలు

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో రూ.63 లక్షలతో ఇంటింట కుళాయిలు పనులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించనున్నామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు.


వేపాడ: సోపురంలో రజకుడి నివాసం వద్ద ఇస్త్రీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

గ్రామంలో మంగళవారం ఉదయం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి విశేష స్పందన లభించిం ది. ఎమ్మెల్యేకు సర్పంచ్ మురిపిండి గంగరాజు తదితరులు ఘనస్వాగతం పలికారు. కాశీపురం వీధిలో మహిళలు ఎమ్మెల్యేను సత్కరించి కేక్ కట్ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాల ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు మార్పుచేయించాలని, అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయించాలని స్థానికులు కోరడంతో, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని అంతా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, గ్రామ సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపీటీసీలు ఏ.సత్యనారాయణ, టి.వి.రమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎం.జగ్గుబాబు, బుద్దా అప్పలనాయుడు, ద్వారపూడి గంగునాయుడు, బి.రామునాయుడు, కె.పి.నాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఓటుతోనే మెరుగైన సమాజం సాధ్యం

- ఆర్డీఓ అప్పారావు


చీపురుపల్లి: 'యువర్ ఓట్-యువర్ వాయిస్' పేరుతో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీఓ అప్పారావు

చీపురుపల్లి: మెరుగైన సమాజ నిర్మాణం ఓటుతోనే సాధ్యమని, ఓటు హక్కు ఎంతో విలువైనదని ఆర్డీఓ ఎం.అప్పారావు అన్నారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద 'యువర్ ఓట్-యువర్ వాయిస్' పేరుతో ఏర్పాటు చేసిన స్వీయ చిత్రం పాయింట్(సెల్ఫీ బాక్స్)ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారంతా తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్లలో చైతన్యం కలిగించేందుకు స్వీయ చిత్రం పాయింట్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తహసీల్దార్ ఎం.సురేష్, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


చీపురుపల్లిరూరల్: యువతతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆశయసంస్థ చైర్మన్ రమణ

ఓటు హక్కుపై అవగాహన

చీపురుపల్లిరూరల్(గరివిడి): మంచి సమాజం ఏర్పాటు ఓటుతోనే సాధ్యమని ఆశయ సంస్థ చైర్మన్ రెడ్డి రమణ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గరివిడి మండలం కొండశంబాం గ్రామంలో ప్రజలకు ఓటు హక్కుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఓటు హక్కును వినియోగించుకుంటామని యువతతో ప్రతిజ్ఞ చేయించారు.

రూ.41.80 లక్షలతో ఇంటింట కుళాయిలు

లక్కవరపుకోట: మండలంలోని రంగరాయపురం పంచాయతీలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.41.80 లక్షలతో ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మంగళ వారం భూమి పూజ చేశారు. రంగరాయపురం పంచాయతీ పరిధిలో 373 ఇళ్లకు కుళాయిల ఏర్పాటు పనులను మూడు నెలల్లోగా పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎస్.పైడిరాజు తెలిపారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, ఎంపీటీసీ కె.సత్యవతి, మాజీ సర్పంచ్ దేగల సాయిలక్ష్మి పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు


ముగ్గులు వేస్తున్న యువతులు

వేపాడ: మండలంలో వల్లంపూడి గ్రామంలో సాంబమూర్తి తీర్థమహోత్సవం సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 28 మంది మహిళలు పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. తీర్థం సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రాష్ట్ర పథకాలపై జాతీయ వర్క్‌షాప్‌లో ప్రస్తావన

శృంగవరపుకోట: 'రాష్ట్రాల ఆర్థిక వనరులు' అనే అంశంపై పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో రెండో రోజు మంగళవారం నిర్వ హించిన జాతీయ విధాన వర్క్‌షాప్‌లో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు,ఆర్థిక ప్రయోజనాలు, పథకాల అమలులో అనుసరిస్తున్న విధానాలు, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు రాష్ట్ర ప్రభుత్వ వాటాను కలిపి అందిస్తున్న తీరును వివరించారు. అనంతరం పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ సంస్థ డైరెక్టర్ మాధవన్‌ను, సదస్సు నిర్వాహకుడు శ్రీమానవన్‌ను ఎమ్మెల్సీ కలిశారు. సదస్సులో విజయనగరం జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ పి.వి.వి.సూర్యనారాయణ(సురేష్ బాబు) కూడా హాజరయ్యారు.


పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ సంస్థ డైరెక్టర్ మాధవన్,మానవ్‌ను కలిసిన ఎమ్మెల్సీ రఘురాజు

సచివాలయాల్లో ఆధార్ సేవలు

బొండపల్లి: మండలంలోని మూడు గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలను ప్రారంభించినట్లు ఎంపీడీఓ ఏ.వేదవతి మంగళవారం తెలిపారు. బొండపల్లి,గొట్లాం,దేవుపల్లి గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ సేవలకు సంబంధించి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆధార్ కార్డుల్లో పేర్ల మార్పులు,చేర్పులు, ఫోన్ నంబర్ల అనుసంధానం, ఎలాంటి సమస్యలు ఉన్నా ఆయా కేంద్రాల్లో సంబంధిత సేవలు పొందవచ్చని చెప్పారు.

చెరువు ఆక్రమణపై సర్వే

వేపాడ: మండలంలో నల్లబిల్లి గ్రామ రెవెన్యూపరిధిలో కనుమల చెరువు ఆక్రమణపై వచ్చిన ఫిర్యాదులపై సర్వేయర్ బాలరాజుతో మంగళవారం సర్వే చేయించామని తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు తెలిపారు. నల్లబిల్లి గ్రామ రెవెన్యూలో సర్వే నంబర్- 21లో జిరాయితీ భూమిని ఆనుకుని ఉన్న కనుమల చెరువులో సుమారు సెంటున్నర వరకు ఆక్రమణలను గుర్తించి, హద్దులు నిర్ధారించామని చెప్పారు.

మధ్యాహ్న భోజనాల పరిశీలన

దత్తిరాజేరు: షికారుగంజి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మంగళవారం పరిశీలించారు. వంటకాలను రుచి చూసిన అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ రోజూ మెనూ ప్రకారం నిర్వాహకులు భోజనాలు అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు.

బాలికల ఎదుగుదలే నిజమైన అభివృద్ధి

జాతీయ బాలికా దినోత్సవాన్ని పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాలికల హక్కులతో పాటు,విద్య,వైద్యం, పౌష్టికాహారం, చట్టాలపై ఉపాధ్యాయులు, వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కల్పించారు. విద్యార్థు ల కు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, చిత్రలేఖనం పోటీ లు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిన్సిపాల్ సీహెచ్.కేశవరావు మాట్లాడుతూ బాలికల ఎదుగుదలే సమాజానికి నిజమైన అభివృద్ధి అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆడపిల్లల రక్షణకు, వికాసానికి ఇతోధికంగా కృషి చేయాలని సూచించారు.వైస్ ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రం మినహా మిగతా రాష్ట్రాల్లో ప్రస్తుతం బాలుర కంటే బాలికల నిష్పత్తి తక్కువగా ఉంటోందని, బాలికల శాతం తక్కువ కాకూడదని, స్త్రీ, పురుష సమానత్వం ఉండాలని చెప్పారు.

– ఎస్.కోట,వేపాడ, జామి, ఎల్.కోట, కొత్తవలస రూరల్, గజపతినగరం రూరల్


వేపాడ: ర్యాలీ నిర్వహిస్తున్న గురుకుల పాఠశాల బాలికలు, ఉపాధ్యాయినులు


శృంగవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు


లక్కవరపుకోట: జమ్మాదేవిపేట గురుకులంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయకుమార్‌పాత్రో


జామి: ఎమ్మార్సీలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


కొత్తవలస రూరల్: వియ్యంపేట గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జయశ్రీ


గజపతినగరం రూరల్: మరుపల్లి కేజీబీవీలో మాట్లాడుతున్న సర్పంచ్ రామలక్ష్మి

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని


సాగునీటి కాలువలో పూడికల తొలగింపు పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి


చీపురుపల్లిరూరల్: వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

గజపతినగరం రూరల్: ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పని కల్పించనున్నామని డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి తెలిపారు. మండలంలోని గంగచోళ్లపెంట బద్ది చెరువు నుంచి సీతమ్మ చెరువు వరకు వేతనదారులు చేపడుతున్న ఫీడర్ చానెల్ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. వేతనదారుల మస్టర్ల సీట్లను తనిఖీ చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి సంబంధించి వేతనదారులతో కేవలం చెరువుల పనులే చేయించకుండా సాగునీటి కాలువల్లో పూడికలు, తుప్పల తొలగింపు పనులనూ జిల్లా వ్యాప్తంగా చేయిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో 23 సాగునీటి కాలువల్లో ఉపాధి హామీ పనులు చేయించామని పేర్కొన్నారు. ఆమె వెంట ఏపీడీ జనార్దన్, ఏపీఓ, టీఏలు ఉన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

చీపురుపల్లిరూరల్: ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చే కొలతల ప్రకారం ఉపాధి హామీ పనులు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ వేతనం అందుతుందని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు అన్నారు. మండలంలోని పెదనడిపల్లి గ్రామం కొత్త చెరువులో వేతనదారులు చేపడుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. వేతనదారులతో ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని, ఒకరికి బదులు మరొకరు పనులకు హాజరు కాకూడదని చెప్పారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

చీపురుపల్లి: మండలంలో గృహనిర్మాణాలపై హౌసింగ్ డీఈ గౌరీశంకర్ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉద్యోగులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జగనన్న లే అవుట్లతో పాటు సొంత స్థలాల్లో మంజూరు చేసిన ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులతో అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడి వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేయించి, సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని కోరారు. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లింపులు అయ్యేలా వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. గ్రామాల్లో ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వారి వివరాలను తక్షణమే సచివాలయంలో నమోదు చేస్తే ఇళ్లు మంజూరవుతాయని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావు, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, హౌసింగ్ ఏఈ సూర్యనారాయణ, నాయకులు పతివాడ రాజారావు, కరిమజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న డీఈ గౌరీశంకర్

'గడప గడప' పనులను వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: మండలంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సచివాలయాలకు మంజూరు చేసిన ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధికారులకు, మండల ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే అతిథిగా హాజరయ్యారు. మండల అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలను సభకు వివరించారు. అలాగే గ్రామాల్లోని సమస్యలను పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాలతో కొన్ని సమస్యల కు అధికారులు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. గత సమావేశంలో సభ దృష్టికి వచ్చిన సమస్యల్లో ఎన్నింటిని పరిష్క రించారని అధికారులను ఎమ్మెల్యే ఆరా తీశారు. రెవెన్యూ శాఖకు సంబంధించి మ్యుటేషన్, ఇతర పనుల్లో సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని మల్లివీడు సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున సభలో ప్రస్తావించ గా..తహసీల్దార్ టి.రామకృష్ణ స్పందిస్తూ పనిచేయని సిబ్బందిపై నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని ఇప్పటి వరకు 10 గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేశామని, ఆ సమయంలో హామీ ఇచ్చిన పనులను త్వరగా చేయించాలని, పనులు పూర్తి చేసిన నెల రోజుల లోపే బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. ఎంపీడీఓ కె.రూపేష్, వైస్ ఎంపీపీలు ఆవాల శ్యామల, డి.దేవి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రహదారి భద్రత మనందరి బాధ్యత


ఎస్.కోట: ధర్మవరం హైస్కూల్‌లో మాట్లాడుతున్న సీఐ సింహాద్రినాయుడు

శృంగవరపుకోట: రహదారి భద్రత మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని ఎస్.కోట సీఐ ఎస్.సింహాద్రి నాయుడు అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ధర్మవరం ఉన్నత పాఠశాల/ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై మంగళవారం అవగాహన కల్పించారు. అలాగే రహదారి భద్రతపై విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్ఐ లోవరాజు, హెచ్ఎం బి.లక్ష్మి, పీఎంసీ చైర్మన్ తగరంపూడి రమణ పాల్గొన్నారు.


కొత్తవలస: వాహన చోదకులకు వైద్యపరీక్షలు చేయిస్తున్న ఎస్ఐ దేవి

వాహన చోదకులకు వైద్యపరీక్షలు

కొత్తవలస: వాహన చోదకులంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ బి.దేవి అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా స్థానిక పీహెచ్‌సీ వద్ద ఆటోడ్రైవర్లతో పాటు పలువురు వాహన చోదకులకు మంగళవారం వైద్యపరీక్షలు చేయించారు. ఆరోగ్యంగా ఉంటేనే వాహనాలు నడపాలని ఎస్ఐ సూచించారు.

మాదకద్రవ్యాల జోలికి పోవద్దు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఆరోగ్యాన్ని, భవిష్యత్‌ను నాశనం చేసే మాదకద్రవ్యాల జోలికి విద్యార్థులు, యువత పోవద్దని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఈబీ ఏఎస్పీ అస్మా ఫర్హీన్ అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, వాటి నియంత్రణపై గరివిడి అవంతీ సెయింట్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా జయప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. డ్రగ్స్ జోలికి పోబోమని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. సీఐ పి.ఉమామహేశ్వరరావు ,హోమియో వైద్యాధికారి దీప్తి, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, కళాశాల ఏఓ జి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.


చీపురుపల్లిరూరల్: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈబీ ఏఎస్పీ ఫర్హీన్

మత్తుపదార్థాలతో జీవితం నాశనం

గజపతినగరం: చదువుకునే వయస్సులో మత్తుపదార్థాలకు బానిసగా మారితే జీవితాలు నాశనమవుతాయని ఎస్ఐ గంగరాజు అన్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలు, ట్రాఫిక్ నిబంధనలపై స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు.

సారా తయారు చేస్తే కేసులు

కొత్తవలస రూరల్: సారా తయారు చేసినా, విక్రయించినా కేసులు తప్పవని, కుటుంబాలను చిన్నాభిన్నం చేసే సారా రక్కసికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని కొత్తవలస ఎస్ఐబీ సీఐ రాజేశ్వరి అన్నారు. ముసిరాం గ్రామంలో ఎస్ఈబీ, కొత్తవలస పోలీసులు, ఇంటిలిజెన్స్ విభాగాల ఆధ్వర్యంలో పరివర్తన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అంతకుముందు గ్రామ పరిసరాల్లో సారా తయారీ స్థావరాలపై దాడులు చేశారు. దాడుల్లో 15 లీటర్ల సారాని గుర్తించి ధ్వంసం చేశారు. డీటీఎఫ్ సీఐ కె.ఇందిరా దేవి, ఇంటిలిజెన్స్ ప్రతినిధి వి.శేఖర్ బాబు, కొత్తవలస సీఐ బాలసూర్యారావు పాల్గొన్నారు.


కొత్తవలస రూరల్: ముసిరాంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ సిబ్బంది